


వినాయక విగ్రహాలు సిద్ధం







వినాయక చవితికి వివిధ వేషధారణల్లో విఘ్నేశ్వర విగ్రహాలు సిద్ధమయ్యాయి. పర్యావరణానికి హాని కలగకుండా మట్టి, పేపర్‌తో తయారుచేసిన విగ్రహాలను తిరుపతి సమీపం మంగళం పరిధిలోని బొమ్మల క్వార్టర్స్‌లో సిద్ధం చేశారు. దశాబ్దాలుగా వందల కుటుంబాలు ఈ విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు.వంద రూపాయల నుంచి 10వేల వరకు విగ్రహాలను రెడీ చేశారు.ఈ సంవత్సరం కొత్తగా ఖైరతాబాద్ తరహాలో వినాయకులను తయారు చేశారు. ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు 5వేల విగ్రహాలను పంపించారు.ఒక్క అడుగు నుంచి 18 అడుగుల వరకు విగ్రహాలను తయారు చేసి అమ్మకాలకు అందుబాటులో పెట్టారు. రూ.2,500 నుంచి రూ.లక్ష వరకు వీటి ధరలున్నాయని తయారీ దారుల్లో ఒకరైన శ్రీ విఘ్నేశ్వర టెరికోట వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల ప్రసాద్ తెలిపారు.ఈసారి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆర్డర్లు ఎక్కువ వచ్చాయన్నారు.

- మంగళం(తిరుపతి)

గాలేరు-నగరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సస్పెన్షన్



ధ్వంసమైన ఏటీఎం

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 1వ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.కోదండరామిరెడ్డిని రాష్ట్రప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసింది. ఇదివరకూ ఓ రిట్ పిటిషన్‌కు సంబంధించి ఈయన హైకోర్టుకు కౌంటర్ అఫిడవిట్ సక్రమంగా దాఖలు చేయలేదని, దాంతో కోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ నివేదించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. కోదండరామిరెడ్డి గతంలో అన్నమయ్య జిల్లా రాజంపేట ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో అక్కడి గాలేరు-నగరి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 4వ యూనిట్‌కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేశారు. అప్పట్లో భూసేకరణ వివాదానికి సంబంధించి కె.నాగిరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ (నంబరు 119-2022) దాఖలు చేశారు. ఈ కేసులో కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్‌ను సక్రమంగా దాఖలు చేయకపోవడంతో విచారణ సందర్భంగా హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. దీంతో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసే సమయంలో ఆర్ అండ్ ఆర్ పాలసీ-2005, ఆర్ఎఫ్‌సీటీ ఎల్‌పి ఆర్ అండ్ ఆర్ యాక్ట్ -2013 చట్టాల్లోని అంశాలను విస్మరించారని, హైకోర్టుకు వాస్తవాలను వివరించడంలో విఫలమయ్యారని గుర్తించారు. ఈ కారణంగానే హైకోర్టు ఎదుట ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ప్రస్తుతం తిరుపతి జిల్లా గాలేరు-నగరి ప్రాజెక్టు 1వ యూనిట్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కోదండరామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్బీఐ ఏటీఎంలో రూ.39 లక్షల చోరీ

చంద్రగిరి, ఆగస్టు 30: చంద్రగిరి పట్టణం కొత్తపేటలోని కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం స్థానికులు ఏటీఎంలో చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ రామయ్య, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఏటీఎంను పరిశీలించి, వేలిముద్రల నిపుణులను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. వేలి ముద్రలు సేకరించిన అనంతరం సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా గురువారం రాత్రి 1.30 నుంచి 2.30 గంటల మధ్యలో ఓ దుండగుడు సెక్యూరిటీ గార్డు ముసుగులో ఏటీఎం రూములో చొరబడ్డాడు. ఏటీఎం డిజిటల్ పాస్‌వర్డ్‌ను కీ ప్యాడ్‌ను పగలగొట్టి అందులో ఉన్న రూ.39 లక్షల నగదును ఎత్తుకెళ్లాడు. ఏఎస్పీ నాగభూషణం, క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ కూడా ఏటీఎంను పరిశీలించారు.బ్యాంక్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటివరకూ ఏటీఎంలను గ్యాస్ కట్టర్‌తో పగులగొట్టి నగదును చోరీ చేసేవారు.ఈసారి డిజిటల్ లాక్ కీ ప్యాడ్‌ను పగలగొట్టి చోరీ చేయడం చూస్తుంటే ఇది ఏటీఎం టెక్నీషియన్ పనే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.చోరీ చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు చంద్రగిరి పోలీసులతో ఒక బృందాన్ని, తిరుపతి క్రైమ్ పోలీసులతో మరో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ నాగభూషణం తెలిపారు. చోరీ జరిగిన ఎస్బీఐ ఏటీఎంను ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం రాత్రి పరిశీలించారు.భద్రతా ఏర్పాట్లపై బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వలనే చోరీ జరిగిందంటూ అసహనం వ్యక్తం చేశారు.ఇకపై ఏటీఎంల వద్ద ఖచ్చితంగా సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఎస్పీ రమణకుమార్, సీఐ రామయ్య ఉన్నారు.



సీసీ పుటేజీలో బయటపడ్డ చోరుడు



ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

జిల్లా ప్రత్యేకాధికారిగా సత్యనారాయణ

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రత్యేకాధికారిగా దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది. అందులో భాగంగా తిరుపతి జిల్లాకు దేవదాయ శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న 2006 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎస్.సత్యనారాయణను ప్రత్యేక అధికారిగా నియమించింది.జిల్లాలో మొత్తం కార్యక్రమాలను ఆయన తరచూ పర్యవేక్షిస్తూ సమీక్షిస్తూ సక్రమంగా అమలయ్యేలా కృషి చేయనున్నారు.

ముగ్గురు డీఎస్పీలకు పదోన్నతి



రామకృష్ణ



వెంకటాద్రి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ముగ్గురు డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ డీజీపీ ద్వారకా తిరుమల రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సీఐ నుంచి డీఎస్పీ వరకు పనిచేసిన ఐ.రామకృష్ణ ఇంటెలిజెన్సులో పనిచేస్తున్నప్పటికీ డిప్యుటేషన్‌పై పోలీసు శిక్షణ కళాశాలలో డీఎస్పీగా ఉన్నారు. ఆయన అనుభవం, పరిపాలనా పరంగా తిరుమలలో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమని భావించిన ప్రభుత్వం తిరుమల శాంతి భద్రతల ఏఎస్పీగా నియమించింది. అలాగే ఏఎస్పీగా పదోన్నతి పొందిన రవి మనోహరాచారి.. ఎస్ఐ క్యాడర్ నుంచి డీఎస్పీ వరకు చిత్తూరు, మదనపల్లె, తిరుపతి ఎస్బీ, సీఐడీ, ఇంటెలిజెన్సు, ఈస్ట్, తిరుపతి డీఎస్పీగా పనిచేశారు. మొన్న జరిగిన డీఎస్పీల బదిలీల్లో సీఐడీ విభాగానికి బదిలీ అవగా, ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. సెలవుపై ఉన్నారు. దీంతో ఆయన్ను తిరుపతి శాంతి భద్రతల విభాగానికి ఏఎస్పీగా బదిలీ చేశారు. ఇక రేణిగుంట డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటాద్రికి పదోన్నతి కల్పించిన ప్రభుత్వం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని పేర్కొంది. వారం కిందట తిరుపతి శాంతి భద్రతల ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాగభూషణరావును మళ్లీ తిరుపతి క్రైం అదనపు ఎస్పీగా నియమించింది.



రవిమనోహరాచారి



నాగభూషణరావు

ప్రతి ఒక్కరూ ఓ మొక్కనాటి సంరక్షించాలి

● కలెక్టర్ వెంకటేశ్వర్

మంగళం, ఆగస్టు 30: పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి సంరక్షించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కపిలతీర్థం వద్ద ఉన్న నగర వనంలో జరిగిన వనమహోత్సవంలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. నవంబరు మాసం వరకు ప్రతి ఒక్కరూ పర్యావరణ హితాన్ని కోరుతూ మొక్కలను నాటాలని కోరారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. మానవ మనుగడకు చెట్లు ఎంతో కీలకమని వాటిని నరకొద్దని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జేసీ శుభం భన్సల్, స్టేట్ సిల్వి కల్చరిస్టు యశోద బాయ్, జూపార్కు క్యూరేటర్ సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారి సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మొక్కను నాటిన కలెక్టర్ వెంకటేశ్వర్

వినాయక మండపాలకు అనుమతి కావాలా?

● వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోండి

చిత్తూరు,ఆగస్టు 30: నాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలంటే ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని తీసుకొచ్చింది. 'గణేష్ ఉత్సవ్. నెట్' అనే వెబ్‌సైట్‌లో కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది,విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ రోజు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ చేస్తారు, ఏ వాహనం ద్వారా విగ్రహాన్ని తీసుకెళతారనే వివరాలను నమోదు చేసి, దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం 79950 95800 నెంబరు వాట్సాప్‌కు హాయ్ అని పెట్టాలి.అప్పుడు ఎన్‌వోసీ కోసం చేయాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా మొబైల్‌కు సమాచారం వస్తుంది. అలాగే దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్‌కు వెళుతుంది. ఆ అధికారులు మండప ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌వోసీ జారీ చేస్తారు. నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసుకుని మండపాల్లో ఉంచాలి. పోలీసు అధికారులు సందర్శనకు వచ్చినప్పుడు క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసి తనిఖీ చేస్తారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



జస్టిస్ రాకేష్‌కుమార్

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రాకేష్‌కుమార్, తెలంగాణ ఎంపీ నగేష్, ఏపీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, సినీ నిర్మాత డీవీవీ దానయ్య, నటుడు సుడిగాలి సుధీర్, కర్ణాటక మంత్రి కేహెచ్ మునియప్ప, ఉత్తరప్రదేశ్ మంత్రి సూర్యప్రతాప్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారికి 16 ద్విచక్ర వాహనాల విరాళం



తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం 16 ద్విచక్ర వాహనాలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన టీవీఎస్ మోటార్స్ ఎండీ వేణుసుదర్శన్ ఈ వాహనాలను అందజేశారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనాలకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం దాత వారికి వాహనాల తాళాలను అందజేశారు. 16 ద్విచక్ర వాహనాల్లో 15 ఎలక్ట్రికల్ వాహనాలు ఉన్నాయి. వీటి ధర దాదాపు రూ.22 లక్షలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఉత్తరప్రదేశ్ మంత్రి

తిరుచానూరు, ఆగస్టు 30: తిరుపతి రూరల్ మండలంలోని వేమూరు గ్రామంలో దామా అయ్యప్ప నాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం ఉత్తరప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి సూర్యప్రతాప్ సాహి సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో రైతు ఆచరిస్తున్న తక్కువగా భూమి దున్నడం, పంట వ్యర్థాలతో భూమిని కప్పి ఉంచడం, ఏటీఎం మోడల్, దేశీ వర్మీకంపోస్టు తయారీ, పట్టుపురుగుల పెంపకం, దేశీ ఆవులు, ప్రకృతి వ్యవసాయంలో చీడ పీడల నివారణకు ఉపయోగించే కషాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతును అభినందించారు. ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముగం, సిబ్బంది, వ్యవసాయశాఖ విస్తరణ అధికారి విశ్వనాథ్, డాక్టర్ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ కింద పడి ఒకరి మృతి



మృతి చెందిన అతిపాల్

భాకరాపేట, ఆగస్టు 30: తిరుపతి - మదనపల్లె మార్గంలో జరుగుతున్న రహదారి పనుల్లో పనిచేస్తున్న వ్యక్తి టిప్పర్ కింద పడి మృతి చెందినట్లు భాకరాపేట ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు చిన్న గొట్టిగల్లు మండలం నెమలిగుండ్ల సమీపంలో మెగా కంపెనీ బేస్ క్యాంప్ సమీపంలో హర్యానాకు చెందిన అతిపాల్(37), అనిల్‌కుమార్‌లు గురువారం రాత్రి పనులు ముగించుకుని పక్కనే మట్టి రోడ్డుపైన నిద్రిస్తుండగా, రాత్రి పూట పనిచేసే వ్యక్తులు టిప్పర్‌ను రివర్స్‌లోకి తీస్తూ వారిపైకి పోనిచ్చారు. ఈ ఘటనలో అతిపాల్‌కు తీవ్ర గాయాలై పొట్టలో పేగులు బయటకు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్పగాయాలైన అనిల్ కుమార్‌ను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అతిపాల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాకాల సీఐగా మద్దయ్య ఆచారి



పాకాల, ఆగస్టు 30: పాకాల సీఐగా కె.మద్దయ్య ఆచారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఎస్‌ఐలు మహేష్‌బాబు, లోకేష్‌కుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

ఆర్సీపురం ఎస్‌ఐగా రామాంజనేయులు

రామచంద్రాపురం, ఆగస్టు 30: మండల ఎస్‌ఐగా రామాంజనేయులు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతి యూనివర్శిటీ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ

తిరుచానూరు, ఆగస్టు 30: తిరుచానూరు ఎస్‌ఐలుగా శుక్రవారం అరుణ, సాయినాథ్ చౌదరి బాధ్యతలు స్వీకరించారు. వారికి పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

లీకేజీలు అరికట్టి.. గుంతలు పూడ్చి..



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

రామచంద్రాపురం, ఆగస్టు 30: ఆర్సీపురం ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైను లీకేజీ వల్ల ఏర్పడ్డ గుంతలు.. ప్రయాణికులకు ఇక్కట్లు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. శుక్రవారం పంచాయతీ సిబ్బంది తాగునీటి పైపులైను లీకేజీని అరికట్టారు. ఆర్‌అండ్‌బీ అధికారుల గుంతలపై కంకర వేసి పూడ్చారు. దీంతో ప్రయాణం కొంత సులభతరమైంది.

బాలయ్య అభిమానుల అన్నదానం



చంద్రగిరి, ఆగస్టు 30: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులు శుక్రవారం తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లెలో అన్నదానం చేశారు. బాలకృష్ణ సినిమా పరిశ్రమకు వచ్చి 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన అభిమానులు అన్నదానం చేశారు.లోకేష్ చౌదరి, మదనమోహన్, రాకేష్, కోరా పవన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి ఘన సన్మానం



చంద్రగిరి, ఆగస్టు 30: మాజీ మంత్రి గల్లా అరుణకుమారిని చంద్రగిరి మండలం, తొండవాడ సర్పంచ్ మల్లం దీపికారెడ్డి, సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ చంద్రమౌళిరెడ్డిలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తిరుపతి అమరరాజా ఫ్యాక్టరీలో గల్లా అరుణకుమారి పుస్తకావిష్కరణ సందర్భంగా దీపికారెడ్డి, చంద్రమౌళిరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి, ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

చెత్తకుండీల తొలగింపు : రోడ్డుపైనే పడేస్తున్న వ్యర్థాలు



తిరుమలనగర్ వద్ద తొలగించిన చెత్తకుండి

మంగళం, ఆగస్టు 30: మంగళం పరిధిలోని పంచాయతీలలో వ్యర్థాలను వేసేందుకు ఏర్పాటు చేసిన చెత్త కుండీలను ఉన్న ఫళంగా తొలగించేశారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీని 2020లో ప్రభుత్వం సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళం క్వార్టర్స్, తిరుమలనగర్, శెట్టిపల్లి పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అయితే పంచాయతీలు విభజించబడినా ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన చెత్త కుండీలను ఆయా పంచాయతీల్లోని ప్రజలు వినియోగించుకుంటుండేవారు. దీంతో ఒక పంచాయతీలో పడేసిన చెత్తతో మరో పంచాయతీ వారికి ఇబ్బందిగా ఉండేది. చెత్త కుండీలను ఎవరి పంచాయతీ పరిధిలో వారికి ఏర్పాటు చేయాలని ఆయా పంచాయతీల ప్రజలు అధికారులను కోరారు. అయినప్పటికీ అలాగే ఉంచడంతో చిన్నపాటి వాగ్వాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం చెత్తకుండీలను అక్కడ నుంచి తొలగించడంతో అదే ప్రదేశంలో ప్రజలు వ్యర్థాలను పడేస్తున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి సెక్రటరీ మురళిని వివరణ కోరగా, చెత్తకుండీల తొలగింపుపై తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. దీనిపై విచారణ చేస్తామని, ఇంటింటి చెత్త సేకరణ కోసం చెత్తబుట్టలను పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచామని, చెత్తకుండీలను తొలగించాలని ఎక్కడా ఆదేశాలు ఇవ్వలేదన్నారు.

'మారుతినగర్ సుబ్రహ్మణ్యం' యూనిట్ ధన్యవాదాలు

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' చిత్రాన్ని హిట్‌చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఈ చిత్ర యూనిట్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.చిత్ర దర్శకుడు లక్ష్మణ్ కార్య, నిర్మాత తబిత, నటుడు అంకిత్ కొయ్యా, నటి రమ్యా పసుపులేటి, చిత్ర యూనిట్ సభ్యులు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.దర్శకుడు లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ..తమకు చాలా పెద్ద హిట్‌ను ఇచ్చారని, సక్సెస్ టూర్‌ను నిర్వహించి, స్వామి దర్శనంతో ముగించామన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

పాకాల, ఆగస్టు 30: మండలంలోని మణిపిరెడ్డిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేయనున్న పి.జయబాలకు ఘనంగా సన్మానం జరిగింది. ఎంఈవోలు కె.బాబ్జీ, ఎం.లింగయ్య, సహ ఉపాధ్యాయులు, బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయుడిగా ఆయన సేవలను కొనియాడారు.బీటీఏ నాయకులు జి.ఆంజనేయులు, ఆదికేశవులు, కృష్ణమూర్తి, రామచంద్రయ్య, రామ్మూర్తి, జి.వెంకటస్వామి, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఉన్నతాధికారుల తనిఖీలు



సీఈ నాగేశ్వరరావు, ఎస్‌ఈ2 సత్యనారాయణ, పరకామణి ఇన్‌చార్జ్ డిప్యూటీఈవో విజయలక్ష్మి, హెల్త్ డిప్యూటీఈవో ఆశాజ్యోతి, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, వీజీవోలు సురేంద్ర, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు తిరుమలలో జరుగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం సాయంత్రం శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధులను పరిశీలించారు. వాహన మండపం నుంచి తనిఖీలు ప్రారంభించిన అధికారులు మాడవీధుల్లోని గ్యాలరీల్లోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, గరుడసేవలో గ్యాలరీలను రెండవసారి నింపడం, తదితర భద్రత అంశాలను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో చివరిరోజున చక్రస్నానం, ఇతర సంబంధిత అంశాలపై చర్చించారు. పుష్కరిణి లోపలికి వెళ్లే, బయటకు వచ్చే మార్గాలను కూడా పరిశీలించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. టీటీడీ విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు.

పరకామణిలోనూ..

అంతకుముందు శ్రీవారి హుండీ కానుకలు లెక్కించే పరకామణి భవనంలోనూ ఈవో, అదనపు ఈవో, సీవీఎస్వో తనిఖీలు నిర్వహించారు. హుండీల తరలింపు, నాణేలు, కరెన్సీల విభజన ప్రక్రియ, పరకామణి లెక్కింపులు, డ్రెస్‌కోడ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. తర్వాత సీసీటీవీ గదిని కూడా చూశారు. ఈ కార్యక్రమాల్లో

శ్రీవారిసేవా సదన్‌లో..

తిరుమలలోని శ్రీవారిసేవాసదన్ 1,2 భవనాలను కూడా పరిశీలించారు. తిరుమలలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న శ్రీవారి సేవకుల నమోదు,లాకర్లు, స్టార్లు, బెడ్‌లు, డ్యూటీల కేటాయింపు, ఆలయ విధులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డిప్ సిస్టమ్, సత్సంగం, ధ్యానం, భజన కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం సేవాసదన్ 2లోని జీడిపప్పు వలిచే హాల్‌ను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. తర్వాత సేవాసదన్‌లలో పరిశుభ్రత, శ్రీవారిసేవకుల వసతి, అన్నప్రసాదం, దర్శనం తదితర సౌకర్యాలను ఈవో, అదనపు ఈవో పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పీఆర్వో నీలిమ, ఏవీఎస్వో సాయిగిరిధర్, శ్రీవారిసేవ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రద్దీలో అత్యవసర వాహనాల రాకపోకలకు అనువుగా ఏర్పాట్లు చేయాలి : ఎస్పీ సుబ్బరాయుడు

బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ అత్యవసర వాహనాలైన అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు సులువుగా రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌తో కలిసి మాడవీధులతో పాటు తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన ఎస్పీ పోలీసు, విజిలెన్స్ అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల మధ్య ఎలాంటి తోపులాటలు లేకుండా పటిష్ఠమైన బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు నుంచి గ్యాలరీలను అనుసంధానం చేస్తూ క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు ఈ సమాచారాన్ని భక్తులకు తెలిసేలా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలిపిరి టోల్‌గేట్ వద్ద ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే తిరుమలకు అనుమతించాలన్నారు. ఈకార్యక్రమంలో తిరుమల ఇన్‌చార్జ్ అదనపు ఎస్పీ వెంకట్రావు, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐలు, ఎస్‌ఐలు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మంగళం, ఆగస్టు 30: వడమాలపేట, పుత్తలపట్టు పరిసరాల్లో శుక్రవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి.. ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. 28 ఎర్రచందనం దుంగలు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన బృందం, ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం పుత్తూరు సెక్షన్‌లోని వడమాలపేట అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున ఎర్రచందనం దుంగలు మోసుకొస్తూ కొందరు తారసపడ్డారు. వారిని చుట్టుముట్టగా దుంగలను వదలి పారిపోయారు. వారిలో నలుగురిని పట్టుకుని, 26ఎర్రచందనం దుంగలు, ఒక ట్రక్, మరో కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో.. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ముగ్గురు, తిరవళ్లూరు జిల్లాకు చెందిన ఒకరు ఉన్నారు. మరో ఘటనలో ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ చిత్తూరు-కడప హైవేలో పుత్తలపట్టు సమీపంలోని రంగంపేట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అటువైపు వచ్చిన కారును ఆపే ప్రయత్నం చేశారు. స్మగ్లర్లు కారును పక్కన ఆపి, పారిపోయే ప్రయత్నం చేశారు. ఒకరిని పట్టుకోగా, మిగిలినవారు పారిపోయారు. కారును తనిఖీ చేయగా రెండు ఎర్రచందనం దుంగలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి అన్నమయ్య జిల్లావాసిగా గుర్తించారు. రెండు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్ తరలించగా, ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు.



హీరో బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ నేతలు, బాలయ్య అభిమానుల అన్నదానం

కేసుల దర్యాప్తులో వేగం పెరగాలి: ఎస్పీ



ప్రసంగిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30: 'కేసులను త్వరగా దర్యాప్తు చేసి, బాధితులకు న్యాయం చేయాలి. అప్పుడే పోలీసు శాఖపై ప్రజలకు మంచి అభిప్రాయం ఉంటుంది' అని ఎస్పీ సుబ్బారాయుడు అన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ సావేరి సెమినార్ హాలులో శుక్రవారం జిల్లాలోని పోలీసు అధికారులకు నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది. సబ్ డివిజన్లవారీగా నేరాలు, ఇతర కేసులపై సుదీర్ఘంగా ఎస్పీ సమీక్షించారు. కొంతమంది అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. అలసత్వం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. డయల్ 100, 112 కాల్స్‌పై తక్షణం స్పందించాలని కోరారు. బేసిక్, విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గంజాయి హాట్ స్పాట్లలో తగిన బీట్లు, పికెట్లు ఏర్పాటు చేసి తరచూ తనిఖీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతి పోలీసుస్టేషన్‌లో పబ్లిక్ సేఫ్టీ టీమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అపరిచిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

'సైబర్ నేరగాళ్లు రూటు మార్చి.. పోలీసు అధికారుల ఫొటోలను వాట్సాప్ పిక్‌లో పెట్టి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందువల్ల అపరిచిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి' అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. మీ పేరు లేదా మీ కుమారుడి పేరుపై పార్శిల్ వచ్చిందని.. అందులో మాదకద్రవ్యాలు ఉన్నట్లు గుర్తించామని బెదిరిస్తూ.. తాము ముంబై కస్టమ్స్ డిపార్టుమెంటు నుంచి మాట్లాడుతున్నామని పోలీసు యూనిఫాం ఫొటో ఉన్న వ్యక్తి నుంచి మీకు వాట్సాప్ వీడియో లేదా వాయిస్ కాల్ చేసి భయపెడుతున్నారన్నారు. ఇలాంటి అపరిచిత కాల్స్ వచ్చినప్పుడు వెంటనే తాము ఎటువంటి ఆర్డర్ పెట్టలేదని చెప్పి.. సమీప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.



నగర వనంలో జరిగిన వనమహోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఇంజనీర్ కాశీ విశ్వనాథం తదితరులు



గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర పుస్తకావిష్కరణ సందర్భంగా ఆమెను సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు ఊకా విజయకుమార్

ప్రజారోగ్యం ప్రభుత్వాల బాధ్యత: ఎమ్మెల్యే



సదస్సులో ప్రసంగిస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 30: ప్రజారోగ్యం ప్రభుత్వాల భద్రత అని, ఆ దిశగానే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని భువన విజయం ఆడిటోరియంలో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ప్రజారోగ్య జాతీయ సదస్సుకు కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి హాజరయ్యారు. ప్రస్తుతం భయపెడుతున్న మంకీ పాక్స్‌ను గుర్తించడానికి ఆర్టీపీసీఆర్ కిట్లతోపాటు అవసరమైన టీకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం చేశాయన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, డీఎంహెచ్‌వో శ్రీహరి, ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డిఫెన్స్' పరీక్షలు

తిరుపతి(విద్య), ఆగస్టు 30: నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్-2024 పరీక్షలు శనివారం నగరంలో జరగనున్నాయి. అబ్జర్వర్ బ్రిజిలాల్ మీనా, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం పరీక్ష కేంద్రాలను, ఏర్పాట్లను పరిశీలించారు. యూపీఎస్సీ నిర్వహించే ఈ పరీక్షలకు మొత్తం 821 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇందుకుగాను నగరంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ● పరీక్ష కేంద్రం నెంబరు 50005: బాలాజీ కాలనీ వెస్ట్‌చర్చ్ రోడ్డులోని శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు జరగనున్నాయి. ఇంగ్లీష్ పేపర్ ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు, జనరల్ నాలెడ్జ్ పేపర్ మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు జరగనుంది. ఎలిమెంటరీ గణితం పరీక్ష మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుంది. ● పరీక్ష కేంద్రం నెంబరు 50001: శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల వింగ్-ఏ, పరీక్ష కేంద్రం నెంబరు 50002: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల వింగ్-బిలలో నేషనల్ డిఫెన్స్ అండ్ నావెల్ అకాడమీ పరీక్షలు జరగనున్నాయి. గణితం పేపర్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, జనరల్ ఎబిలిటీ పేపర్ మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది.

3న జాబ్‌మేళా

తిరుపతి(విద్య), ఆగస్టు 30: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల మూడో తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారి లోకనాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎస్వీ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సెంటర్ (ఎన్ఏసీ)లో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. బహుళజాతి కంపెనీలైన నియోలింక్, డిక్సన్, ముత్తూట్, కోల్మాన్‌లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ మరేదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన యువతీ యువకులు ఉద్యోగాలకు అర్హులు. అభ్యర్థులు https://shorturl.at/eFhQY లింక్‌లో ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వివరాలకు 91775 08279, 97034 37472 నెంబర్లలో సంప్రదించాలి.

యూపీఎస్ మాకొద్దు : యూటీఎఫ్

తిరుపతి(విద్య), ఆగస్టు 30: యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) తమకొద్దంటూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం నిరసన తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ.. ఓపీఎస్‌ను మాత్రమే తాము ఆమోదిస్తామన్నారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, అవనిగడ్డ పద్మజ, చిళ్ల సురేష్, ఇతర నాయకులు మోహన్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంచినీళ్ల కుంటను పరిరక్షించండి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 30: మంచినీళ్ల కుంటను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు నగరపాలక కమిషనర్ మౌర్య సూచించారు. శుక్రవారం తెల్లవారుజామున 23, 24, 25 వార్డులకు సంబంధించిన మస్టర్ వద్ద ఉద్యోగుల హాజరు నమోదును ఆమె పరిశీలించారు. అనంతరం నేతాజీరోడ్డు, రైల్వేస్టేషన్, కస్తూరిబాయ్ సందు, బేరివీధి, కోర్టు ప్రాంగణం, వేశాలమ్మ గుడివీధి, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ క్రమంలో మంచినీళ్ల కుంటను పరిశీలించారు.

వేలంలో కార్పొరేషన్‌కు రూ.25.5లక్షల ఆదాయం

తిరుపతి, ఆంధ్రజ్యోతి: శెట్టిపల్లె చేపల చెరువు, చక్రాల బండ గుంటకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట ద్వారా కార్పొరేషన్‌కు రూ.25.50లక్షలు ఆదాయం వచ్చినట్టు కమిషనర్ తెలిపారు. మునిశేఖర్, మహేష్, హరీష్ ఒక్కొక్కరు రూ.10లక్షలు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొన్నారు. మహేష్ యాదవ్ రూ.25.50లక్షల హెచ్చుపాటదారుగా నిలిచి చేపల చెరువు హక్కును దక్కించుకున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే లీజు రద్దు చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

డీఎల్ఎస్ఏకు ముగ్గురు సభ్యుల నియామకం

పూతలపట్టు, ఆగస్టు 30: చిత్తూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ)కు ముగ్గురు సభ్యులను నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక కార్యకర్తగా పేరుపొందిన చిత్తూరు నగరం ఓబనపల్లెకాలనీకి చెందిన ధనంజయనాయుడు, విజయనగర్‌కాలనీకి చెందిన డాక్టర్ జనార్దన రెడ్డి, యాదమరి మండలం కీనాటంపల్లెకు చెందిన హరినాయుడులను నియమించారు. వీరు రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

సీడ్ బౌల్ కాన్సెప్ట్ ద్వారా తిరుమలలో మొక్కల పెంపకం



మొక్క నాటి నీరు పోస్తున్న ఈవో

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సీడ్ బౌల్ కాన్సెప్ట్ ద్వారా ఆధునిక సాంకేతికతను ఉపయోగించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శాశ్వతంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. టీటీడీ అటవీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వనమహోత్సవంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి పాల్గొన్న ఈవో తిరుమలలోని పద్మావతి విశ్రాంతి భవన ప్రాంగణంలో మాను సంపంగి 'స్థలవృక్షం' నాటారు. ఈవో మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు మరింత ఆహ్లాదకర ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేందుకు పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. టీటీడీ అటవీ విభాగం ఆధ్వర్యంలో తిరుమలలోని వివిధ ప్రదేశాల్లో వందలాది మాను సంపంగి (మాగ్నోలియా చంపాకా), చందనం (సంతాలమ్ ఆల్బమ్), సీతా అశోక (సరకా అసోకా) మొక్కలను నాటారు. టీటీడీ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసులు, డిప్యూటీఈవోలు భాస్కర్, ఆశాజ్యోతి, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత

తిరుచానూరు, ఆగస్టు 30: మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం ఏర్పడి పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని మహిళా ప్రాంగణం మేనేజరు డాక్టర్ ఫర్హానా అన్నారు. తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో శుక్రవారం వనం-మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు.

వనం మనం కార్యక్రమం

చంద్రగిరి, ఆగస్టు 30: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో-1 లలితకుమారి, పనపాకంలో జడ్పీ స్కూల్లో ఎంఈవో-2 భాస్కర్‌బాబు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకోవాలి

మంగళం, ఆగస్టు 30: భవిష్యత్తు తరాల కోసం ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకుని పెంచాలని మంగళం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు నాయుడు అన్నారు. మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓ మొక్కను పెంచి ఒక సంవత్సరం తర్వాత ఫొటో తీసి సైన్స్ ప్రాజెక్టులో సమర్పించాలని తెలిపారు.

ఎస్జీఎస్ కాలేజీలో వనమహోత్సవం

తిరుపతి రూరల్, ఆగస్టు 30: శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు, అధ్యాపకులు కలసి పూలు, పండ్ల మొక్కలను నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు శివకుమార్, సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

మతమార్పిడి నిషేధ నిర్ణయం హర్షణీయం

తిరుపతి రూరల్, ఆగస్టు 30: ఏపీలో మతమార్పిడులను నిషేధించాలని సీఎం చంద్రబాబు పిలుపునివ్వడం హర్షణీయమని హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల పేర్కొన్నారు. మతమార్పిడులను ప్రోత్సహిస్తున్న వారికి సీఎం నిర్ణయం శరాఘాతమవుతుందని చెప్పారు.

సాయుధ దళం పోలీసు శాఖకు ఆయువు పట్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30: సాయుధ దళం పోలీసు శాఖకు ఆయువు పట్టులాంటిదని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. పోలీసు పరేడ్ గ్రౌండులో శుక్రవారం జరిగిన రిజర్వు సెరిమోనియల్ పరేడ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వు పోలీసు, హోంగార్డులు, బ్యాండ్ పార్టీలను ఉద్దేశించి ప్రసంగించారు. తిరుపతికి నిత్యం వీఐపీలు వరదలా వస్తుంటారని వీటితోపాటు ఉత్సవాలు జరుగుతుంటాయని ఇక్కడ ఉద్యోగం చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని అన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. సర్వీసు రూల్స్ ప్రకారం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు పాల్గొన్నారు.

పలుస్టేషన్లకు ఎస్‌ఐల నియామకం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30: జిల్లాలో పలు పోలీసు స్టేషన్లకు ఎస్‌ఐలను నియమిస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. అలిపిరి స్టేషన్‌కు సుమతి, ఈస్ట్‌స్టేషన్‌కు సీహెచ్ సరస్వతి, కె.బాలాజీ నియమితులయ్యారు. అలాగే తిరుచానూరు ఎస్‌ఐలుగా సాయినాధ్ చౌదరి, అరుణ బాధ్యతలు స్వీకరించారు.



గల్లా అరుణకుమారి

● ఆవిష్కరణ సభలో వక్తల అభిప్రాయం
● సందడిగా జరిగిన సభ

సాహస రచన స్వీయచరిత్ర





అరుణకుమారిలోని నిబద్ధత, సాహసం, నిజాయితీ ఈ గ్రంథంలో అడుగడుగునా కనిపిస్తోంది. ఇదొక చరిత్ర గ్రంథం. అధికార రాజకీయాలు, ముఖ్యంగా రాజకీయాలలో స్త్రీ పరిస్థితి ఎలా ఉంటుందో ఈ పుస్తకంలో వివరంగా ఉంది. స్త్రీ దృష్టికోణంలో ఒక రాజకీయ నాయకురాలు రాసిన అరుదైన ఆత్మకథ ఇది. - ఓల్గా

ఎవరినో బాధపెట్టాలని గానీ, కించపరచాలని గానీ నేను ఈ పుస్తకం రాయలేదు. నా అనుభవంలో జరిగిన సంఘటనలను యథాతథంగా రాశాను. ఎవరి మనసుకైనా నొప్పి కలిగితే మన్నించండి.నా స్వీయచరిత్రకు స్పందనగా ఏది వచ్చినా ఎదుర్కొనేందుకు నేను సిద్ధమే. - గల్లా అరుణకుమారి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30: గల్లా అరుణకుమారిని రాజకీయ నాయకురాలిగా కాక ఆమెలోని పోరాట పటిమను, స్త్రీవాద కోణాన్ని 'గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర' పుస్తకం వెల్లడించిందని ఈ పుస్తకం ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తిరుపతి సమీపంలోని కరకంబాడిలో వున్న అమర రాజ కర్మాగారం ఆడిటోరియంలో శుక్రవారం గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర పుస్తకం ఆవిష్కరణ జరిగింది. నలభై ఏళ్ల రాజకీయాల్లోని పలు సందర్భాలను, నాయకులను నిర్మొహమాటంగా ఆమె రాసిన తీరు ఒక సాహసమే అని వక్తలు వ్యాఖ్యానించారు. పుస్తకాన్ని ప్రసిద్ధ స్త్రీవాద రచయిత్రి ఓల్గా ఆవిష్కరించి ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ, తండ్రి పాటూరి రాజగోపాల నాయుడు నుంచి నేర్చుకున్న విలువలను అరుణకుమారి ఆదర్శవంతంగా, ఆచరణాత్మకంగా జీవితాంతం పాటించారన్నారు. కొత్తగా రాజకీయాలలోకి వచ్చే వారికి ఇదొక పాఠ్య పుస్తకమన్నారు. ఈనాడు ఏపీ సంపాదకుడు మానికొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ... గల్లా కుటుంబంలోని రాజకీయ నేపథ్యం, గాంధేయవాదం స్వీయచరిత్రలో ఉన్నాయన్నారు. వెయ్యి పేజీల పుస్తకం ఆసక్తిగా చదివిస్తుందంటూ, విశ్వనాథ సత్యనారాయణగారి వేయిపడగలతో పోలికను వివరించారు.ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... గల్లా అరుణ కుమారికి తండ్రి ఆదర్శం అయినా, నానమ్మ విస్పష్ట స్వభావం ఆమెలో కనిపిస్తుందన్నారు. స్వతంత్ర్య పోరాట నాయకురాలిగా తల్లి అమరావతి కథను అరుణకుమారి రాయాలని ఆకాంక్షించారు. ఈ పుస్తకాన్ని ప్రచురించిన ఎమెస్కో సంస్థ ఎడిటర్ డి. చంద్రశేఖరరెడ్డి అరుణకుమారి స్వీయచరిత్ర పుస్తకాన్ని సమీక్షిస్తూ ప్రసంగించారు. ఈ పుస్తకానికి కథానాయిక కంటే కథానాయకుడు అరుణకుమారి అని తెలిపారు. రచయితలోని నిజాయితీ ప్రతి పేజీలోనూ కనిపిస్తుందని, పాఠకుని చదివించే గుణం దండిగా ఉందన్నారు. గల్లా జయదేవ్, డాక్టర్ రమాదేవిలు అమ్మ స్వీయచరిత్ర నేపథ్యాన్ని వివరించగా, గ్రంథస్థమైన ప్రతి సన్నివేశానికీ తాను సాక్షినని గల్లా రామచంద్రనాయుడు చెప్పారు. రచయితగా అరుణకుమారి స్పందిస్తూ, కుమార్తె రమాదేవి వెంటబడడంతోనే స్వీయచరిత్ర రాసేందుకు పూనుకున్నానని తెలిపారు.తాను రాసిన మూడువేల పేజీల రాతప్రతులను ఆమె సభ ముందుంచారు. రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడు, పుస్తకప్రియుడు సాకం నాగరాజ, సురేష్‌లకు స్వీయచరిత్ర ప్రతులను సభావేదికపై అందించారు.గత నాలుగు దశాబ్దాలుగా గల్లా అరుణ కుమారి రాజకీయ జీవితంతో సంబంధం ఉన్న నాయకులు, కార్యకర్తలు, గల్లా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పలువురు ఈ సభలో పాల్గొని అరుణకుమారికి అభినందనలు తెలిపారు.

పేద, చిరువ్యాపారులకు నీడ!

బాలయ్య సినీ స్వర్ణోత్సవాన అభిమానుల వితరణ

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆరాధ్య నటుల జన్మదినాలు, సినిమా వేడుకలను అభిమానులు పండుగలా జరుపుకోవడం పరిపాటి. బాణసంచా పేల్చడం, కేక్‌లు కట్ చేయడం, పాలాభిషేకాలు, అన్నదానాలూ, ప్రత్యేక పూజలూ ఇలా వేడుకల జాబితాకు అంతూపొంతూ ఉండదు. దీనికి భిన్నంగా సాగింది శుక్రవారం నందమూరి బాలకృష్ణ అభిమానుల తీరు. బాలయ్య సినీ రంగప్రవేశం చేసి శుక్రవారంతో 50 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కొంతమంది అభిమానులు నగరంలో పేద, చిరువ్యాపారులకు నీడ కల్పించే ప్రయత్నం చేశారు. రోడ్ల పక్కన ఎండా వానలకు అవస్థ పడుతూ బతుకు దెరువు కోసం చెప్పులు కుడుతూ, గడ్డం గీస్తూ, పండ్లూ, పూలు వంటివి విక్రయించే వీధి వ్యాపారులకు గొడుగులు అందజేశారు. కపిల తీర్థం, అన్నారావు సర్కిల్, రుయా ఆస్పత్రి ఎదురుగా, అన్నమయ్య సర్కిల్ రైతు బజారు, గాంధీ రోడ్డు, ఎయిర్ బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో 50 మందికి సాయం చేశారు. బాలయ్య అభిమానులు మదన్ మోహన్, లోకేష్, రాకేష్, కోరా పవన్ తదితరులు పాల్గొనగా, పలువురు వీరిని అభినందించారు.



అన్నమయ్య సర్కిల్ రైతు బజారు వద్ద చర్మకారుడికి గొడుగు అందజేస్తున్న బాలయ్య అభిమానులు

లక్షగాజుల అలంకరణలో అన్నపూర్ణాదేవి



తిరుపతి అర్బన్, ఆగస్టు 30: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణ దేవిని లక్ష గాజులతో విశేషంగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

అసత్య ప్రచారాలను ఖండిస్తున్నాం



ఆర్టీసీ కార్మిక పరిషత్ యూనియన్ నాయకులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 30: నైట్‌షిఫ్ట్, నైట్ అవుట్, నైట్ డ్రైవింగ్ అలవెన్స్‌లపై చేస్తున్న అసత్య ప్రచారాలను కార్మిక పరిషత్ ఆర్టీసీ యూనియన్ తిరుపతి రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు గార్లపాటి రవి, ఈ.ఎం.రెడ్డెప్పనాయుడు (సీసీఎస్ డెలిగేట్) ఖండించారు. శుక్రవారం వారు సీబీఎస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నిర్లక్ష్యం చేసినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్సులు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుత నెలలో అందాల్సిన అలవెన్సులు ట్రెజరీ విభాగంలో ఏర్పడిన సాంకేతిక లోపంతో ఆలస్యమవుతోందన్నారు. ఇంతలోనే ఓ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నిరసన తెలపడం, ఓ పత్రికలో అవాస్తవాలు ప్రచురించడం సరికాదన్నారు. ఇప్పటికే ఈ సమస్యను రాష్ట్రనాయకులు.. ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారని, ఎండీ కూడా తప్పక చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఉద్యోగులు ఆందోళన చెందవద్దని కోరారు. సంఘం డిపో అధ్యక్ష, కార్యదర్శులు కె.వి.రత్నం, సి.మాధవయ్య, పి.టి.వి.ఎస్.మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ-తిరుపతి మధ్య మరిన్ని విమానాలు అవసరం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీసీ రాయలు

తిరుపతి అర్బన్, ఆగస్టు 30: రాజధాని అమరావతి దృష్ట్యా విజయవాడ నుంచి పుణ్యక్షేత్రం తిరుపతికి మరిన్ని విమానాల రాకపోకలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు చైర్మన్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యుడు పి.సి.రాయలు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌ను కలసి విన్నవించారు. అలాగే విమానాశ్రయం మరింత అభివృద్ధి చేయాలని, ఢిల్లీ, ముంబై నుంచి డైరెక్ట్‌గా ఇక్కడ దిగేలా నూతన విమానాలను ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు డ్రగ్స్ ఫ్రీ ఇండియా ర్యాలీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 30: ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ - పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్ ఫ్రీ ఇండియా పేరుతో శనివారం భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. వర్సిటీలో ఉదయం 10 గంటలకు ఈ ర్యాలీని ఎస్పీ సుబ్బరాయుడు, ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ చంద్రాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దామోదరం ప్రారంభిస్తారు. యూనివర్సిటీ నుంచి మహతి దాకా ర్యాలీ సాగుతుంది. ఇందులో యూనివర్సిటీ పరిధిలోని అన్ని కాలేజీల విద్యార్థులు పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినదించాలని ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్ కోరారు.

ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

తంబళ్లపల్లెవాసికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న మణికంఠ నాయక్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30: తిరుపతి శ్రీనివాస సేతు (ఫ్లై ఓవర్)పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెకి చెందిన మణికంఠ నాయక్ స్థానిక అలిపిరి శ్రీవారి సన్నిధి వద్ద ఉన్న పెట్రోలు బంకులో ఆరేళ్లుగా పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఎస్వీ నగర్‌లో కాపురమున్న తన సోదరి ఇంటికెళ్లి తిరిగి తిరుచానూరు నుంచి అలిపిరికి ఫ్లైఓవర్‌పై ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. పీఎస్4 హోటల్ సమీపంలో ఫ్లైఓవర్‌పై నిబంధనలకు విరుద్ధంగా ఎదురుగా వస్తున్న ఏపీ03 టీఎల్ 4187 నెంబరు గల లగేజీ ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జవగా, మణికంఠ నాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. బాధితుడి తండ్రి గోపాల్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ తరుణ్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23మందికి జరిమానా

తిరుపతి(లీగల్),ఆగస్టు 30: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23మంది నిందితులకు రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఇందులో ఇద్దరికి రెండ్రోజులు, నలుగురికి మూడ్రోజుల చొప్పున జైలుశిక్ష విధించారు.

రోగి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు

● స్విమ్స్‌లో బాధితులతో కలిసి ఎమ్మార్పీఎస్ నేతల నిరసన



స్విమ్స్‌లో బాధితులకు మద్దతుగా నిలిచిన ఎమ్మార్పీఎస్ నేతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 30: స్విమ్స్‌లో మూడ్రోజుల కిందట కనిపించకుండా పోయిన రోగి ఆచూకీ కోసం స్విమ్స్ అధికారులు, పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అయినా ఆచూకీ తెలియక పోవడంపై బాధితులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను కుమారుడు విశ్వనాథ్ ఈనెల 27వ తేదీన వైద్యం కోసం స్విమ్స్‌కు తీసుకొచ్చారు. అదే రోజున సీతారామప్పను ఎంఐసీయూ వార్డులో అడ్మిషన్ చేసుకోగా, అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయంపై బాధితులు స్విమ్స్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా జాడ తెలియలేదు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు బాధితులకు మద్దతుగా నిలిచి శుక్రవారం స్విమ్స్‌లో నిరసన తెలిపారు. నడిచే స్థితిలో కూడా లేని వ్యక్తి అర్ధరాత్రి నాలుగు అంతస్తుల పైనుంచి ఎలా కిందకు వచ్చి, బయటకు వెళ్లాడో అధికారులే చెప్పాలని నాయకులు ప్రశ్నించారు. ఏదేమైనా తన తండ్రిని తమకు అప్పగించే బాధ్యత స్విమ్స్ యాజమాన్యాదేనని కుమారుడు విశ్వనాథ్ అన్నారు.

పలువురు వైద్యాధికారులకు, సిబ్బందికి మెమోలు!

స్విమ్స్‌లో రోగి కనిపించకుండా పోయిన విషయంపై పలువురు వైద్యాధికారులకు, సిబ్బందికి శుక్రవారం డైరెక్టర్ ఆర్వీకుమార్ మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులైన వారిపై తదుపరి చర్యలు తీసుకుంటామని స్విమ్స్ అధికారులు పేర్కొన్నారు.

కష్టపడిన వారికి న్యాయం చేయండి

అధినేతకు టీడీపీ నేతల వినతి



చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు, వినతి పత్రం అందజేస్తున్న దంపూరి భాస్కర్ యాదవ్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో తొలి నుంచీ పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు తగిన న్యాయం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబును రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ యాదవ్, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సీఎంను వీరిద్దరూ కలిశారు. వారు మాట్లాడుతూ.. ఐదేళ్లలో వైసీపీ నేతలు తిరుపతిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై బనాయించిన తప్పుడు కేసులన్నింటినీ ఎత్తివేయించాలని కోరారు. అలాగే వైసీపీ నేతలు, పలువురు కార్పొరేటర్లు చేసిన భూ కబ్జాలపై విచారణకు ఆదేశించాలని విన్నవించారు. ఇటీవల ఎన్నికల్లో తిరుపతి సీటును జనసేనకు కేటాయించినప్పటికీ టీడీపీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేశారని, అందువల్లే ఆరణి శ్రీనివాసులుకు భారీ మెజారిటీ వచ్చిందని చెప్పారు. ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ తాను తిరుపతి మున్సిపల్ ఎన్నికల్లో ఏకైక టీడీపీ కార్పొరేటర్‌గా గెలిచి పార్టీ ఉనికి చాటానని, ఐదేళ్లు వైసీపీపై రాజీలేని పోరాటం సాగించానని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో గంగమ్మ ఆలయ చైర్మన్‌గా పదవి ఇచ్చిన సందర్భంలో ఆలయ విస్తరణ చేపట్టడంతోపాటు రూ.కోట్లాది నిధులు సమీకరించానని, తద్వారా ఆలయానికి తగిన ప్రాచుర్యం కల్పించానని వివరించారు. తన సేవలను దృష్టిలో ఉంచుకుని టీటీడీ బోర్డు సభ్యత్వం కల్పించాలని, అలాగే ఇతర నాయకులు, కార్యకర్తలకు కూడా గుర్తింపు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని, కష్టపడిన వారికి తప్పకుండా న్యాయం చేస్తామని అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు.

బైక్, కార్లు తొలగించకపోతే చర్యలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 30: పద్మావతి మహిళా యూనివర్సిటీలో అనధికారికంగా పార్క్ చేసిన ఓ బైక్, తొమ్మిది కార్లను అధికార యంత్రాంగం గుర్తించింది. సెప్టెంబరు రెండో తేదీలోపు వీటిని వర్సిటీ ప్రాంగణం నుంచి తొలగించాలని ఆదేశించారు. లేకుంటే యూనివర్సిటీ భద్రతా కారణాల రీత్యా ఈ వాహనాల యజమానులపై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ గీతావాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా లక్షకుంకుమార్చన



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30: కపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కామాక్షి అమ్మవారికి శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చన నిర్వహించారు. ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహాలక్ష్మి, సరస్వతి, కామాక్షి అమ్మవార్లను కొలువుదీర్చారు. గణపతి పూజ, లక్ష కుంకుమార్చన జరిగింది. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి : డీఆర్ఎం



తిరుపతిలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విజయ్ కుమార్

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 30: తిరుపతి, తిరుచానూరు రైల్వేస్టేషన్లలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచి, నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను గుంతకల్లు డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) విజయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ నిర్వాహణ, స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లాట్ ఫారాల పరిశుభ్రతను మెరుగు పరచాలన్నారు. కోచ్ మరమ్మతుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలన్నారు. అంతకుముందు తిరుచానూరు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సీనియర్ స్కేల్ అధికారులు శ్రావణ్ కుమార్, చంద్రశేఖర్, మణికంఠ, ఉపేంద్ర కుమార్, ప్రభాకర్, సురేష్ బాబు, మాధవరావు,ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ నిధుల వృథాపై కలెక్టర్ ఆగ్రహం !



తీగలు, పొదలతో నిండిన మల్టీపర్పస్ అరేనా

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 30: నగరాభివృద్ధి కోసం కేంద్ర నుంచి విడుదలవుతున్న స్మార్ట్‌సిటీ నిధులను వృథా చేయడమేంటని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా గురువారం శ్రీనివాస క్రీడా సముదాయంలో నిర్వహించిన ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సముదాయంలో నాలుగేళ్లక్రితం స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మాణం చేపట్టి అర్థంతరంగా ఆపేసిన 'మల్టీపర్పస్ అరేనా' (వివిధ రకాల క్రీడలకు ఉపయోగపడేలా నిర్మాణం)ను గమనించి ఇదేంటి పొదలు, తీగలు అల్లుకుని అపరిశుభ్రంగా ఉందని ప్రశ్నించారు. అధికారులు కల్పించుకుని స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మాణం చేపట్టారని, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం తుది దశ పనులు వాయిదా వేస్తున్నారని వివరించారు. దాంతో ఈ నిర్మాణం వివరాలు నివేదిక రూపంలో ఇవ్వాలన్నారు. అలాగే స్విమ్మింగ్ పూల్ లీకేజీ సమస్యను కూడా అధికారులు ప్రస్తావించారు. ఈ క్రమంలో ఇక్కడి అసంపూర్తి పనులు, మరమ్మతులు తదితరాలపై సమగ్ర నివేదిక తయారుచేసి రెండ్రోజుల్లోపు అందజేయాలని డీఎస్‌డీవో సయ్యద్ సాహెబ్‌ను కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది.

అపుస్మా అధ్యక్ష, కార్యదర్శులుగా భాస్కరరాజు, బాషా



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి(విద్య), ఆగస్టు 30: నలందస్కూల్‌లో ఏపీప్రైవేట్ యునైటెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తిరుపతి నగర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర అధ్యక్ష, కార్యదర్శులుగా సంగరాజు భాస్కరరాజు(ఎంఎంటీజీ స్కూల్), ఎస్ఎం బాషా, ఉపాధ్యక్షుడిగా రెడ్డి శ్రీధర్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యక్షుడిగా జి.ఓంప్రకాశ్‌రెడ్డి, కోశాధికారిగా ఎన్.సుబ్రహ్మణ్యంరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా టి.రామకృష్ణారెడ్డి, ఈసీ సభ్యులుగా మదనమోహన్‌రెడ్డి, వెంకటరమణ, డాక్టర్ హర్షిణి, తులసీరామ్‌లను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాయలసీమ రీజియన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డితోపాటు నాయకులు రవీంద్రనాథరెడ్డి, హరినాథశర్మ, శేషారెడ్డి, ఓబులవెంకటరమణారెడ్డి తదితరులు కలసి నూతన కమిటీని అభినందించారు.

నకిలీ స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై కఠిన చర్యలు : డీఈవో

తిరుపతి(విద్య), ఆగస్టు 30: నకిలీ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో డాక్టర్ శేఖర్ హెచ్చరించారు. హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తప్పుడు వాగ్దానాలతో ప్రజలు మోసం చేస్తూ పాఠశాలల్లో కార్యకలాపాలను నిర్వహించే ప్రయత్నాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రపంచ స్కౌట్స్ ఉద్యమం (డబ్లూవోఎస్ఎం), వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ గర్ల్స్ గైడ్స్ అండ్ గర్ల్స్ స్కౌట్స్ (డబ్ల్యూఏజీజీఎస్)కు అనుబంధ సంస్థ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మాత్రమే అనుమతించబడిన సంస్థ అని పేర్కొన్నారు. మరేవైనా సంస్థలు స్కౌట్స్ గైడ్స్ పేరుతో కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు.



గల్లా అరుణకుమారి

● ఆవిష్కరణ సభలో వక్తల అభిప్రాయం
● సందడిగా జరిగిన సభ

సాహస రచన స్వీయచరిత్ర



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 30: గల్లా అరుణకుమారిని రాజకీయ నాయకురాలిగా కాక ఆమెలోని పోరాట పటిమను, స్త్రీవాద కోణాన్ని 'గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర' పుస్తకం వెల్లడించిందని ఈ పుస్తకం ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తిరుపతి సమీపంలోని కరకంబాడిలో వున్న అమర రాజ కర్మాగారం ఆడిటోరియంలో శుక్రవారం గల్లా అరుణకుమారి స్వీయచరిత్ర పుస్తకం ఆవిష్కరణ జరిగింది. నలభై ఏళ్ల రాజకీయాల్లోని పలు సందర్భాలను, నాయకులను నిర్మొహమాటంగా ఆమె రాసిన తీరు ఒక సాహసమే అని వక్తలు వ్యాఖ్యానించారు. పుస్తకాన్ని ప్రసిద్ధ స్త్రీవాద రచయిత్రి ఓల్గా ఆవిష్కరించి ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ, తండ్రి పాటూరి రాజగోపాల నాయుడు నుంచి నేర్చుకున్న విలువలను అరుణకుమారి ఆదర్శవంతంగా, ఆచరణాత్మకంగా జీవితాంతం పాటించారన్నారు. కొత్తగా రాజకీయాలలోకి వచ్చే వారికి ఇదొక పాఠ్య పుస్తకమన్నారు. ఈనాడు ఏపీ సంపాదకుడు మానికొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ... గల్లా కుటుంబంలోని రాజకీయ నేపథ్యం, గాంధేయవాదం స్వీయచరిత్రలో ఉన్నాయన్నారు. వెయ్యి పేజీల పుస్తకం ఆసక్తిగా చదివిస్తుందంటూ, విశ్వనాథ సత్యనారాయణగారి వేయిపడగలతో పోలికను వివరించారు.ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... గల్లా అరుణ కుమారికి తండ్రి ఆదర్శం అయినా, నానమ్మ విస్పష్ట స్వభావం ఆమెలో కనిపిస్తుందన్నారు. స్వతంత్ర్య పోరాట నాయకురాలిగా తల్లి అమరావతి కథను అరుణకుమారి రాయాలని ఆకాంక్షించారు. ఈ పుస్తకాన్ని ప్రచురించిన ఎమెస్కో సంస్థ ఎడిటర్ డి. చంద్రశేఖరరెడ్డి అరుణకుమారి స్వీయచరిత్ర పుస్తకాన్ని సమీక్షిస్తూ ప్రసంగించారు. ఈ పుస్తకానికి కథాకాయిక కంటే కథానాయకుడు అరుణకుమారి అని తెలిపారు. రచయితలోని నిజాయితీ ప్రతి పేజీలోనూ కనిపిస్తుందని, పాఠకుని చదివించే గుణం దండిగా ఉందన్నారు. గల్లా జయదేవ్, డాక్టర్ రమాదేవిలు అమ్మ స్వీయచరిత్ర నేపథ్యాన్ని వివరించగా, గ్రంథస్థమైన ప్రతి సన్నివేశానికీ తాను సాక్షినని గల్లా రామచంద్రనాయుడు చెప్పారు. రచయితగా అరుణకుమారి స్వందిస్తూ, కుమార్తె రమాదేవి వెంటబడడంతోనే స్వీయచరిత్ర రాసేందుకు పూనుకున్నాని తెలిపారు.తాను రాసిన మూడువేల పేజీల రాతప్రతులను ఆమె సభ ముందుంచారు. రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడు, పుస్తకప్రియుడు సాకం నాగరాజ, సురేష్‌లకు స్వీయచరిత్ర ప్రతులను సభావేదికపై అందించారు.గత నాలుగు దశాబ్దాలుగా గల్లా అరుణ కుమారి రాజకీయ జీవితంతో సంబంధం ఉన్న నాయకులు, కార్యకర్తలు, గల్లా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పలువురు ఈ సభలో పాల్గొని అరుణకుమారికి అభినందనలు తెలిపారు.

> అరుణకుమారిలోని నిబద్ధత, సాహసం, నిజాయితీ ఈ గ్రంథంలో అడుగడుగునా కనిపిస్తోంది. ఇదొక చరిత్ర గ్రంథం. అధికార రాజకీయాలు, ముఖ్యంగా రాజకీయాలలో స్త్రీ పరిస్థితి ఎలా ఉంటుందో ఈ పుస్తకంలో వివరంగా ఉంది. స్త్రీ దృష్టికోణంలో ఒక రాజకీయ నాయకురాలు రాసిన అరుదైన ఆత్మకథ ఇది. - ఓల్గా



> ఎవరినో బాధపెట్టాలని గానీ, కించపరచాలని గానీ నేను ఈ పుస్తకం రాయలేదు. నా అనుభవంలో జరిగిన సంఘటనలను యథాతథంగా రాశాను. ఎవరి మనసుకైనా నొప్పి కలిగితే మన్నించండి.నా స్వీయచరిత్రకు స్పందనగా ఏది వచ్చినా ఎదుర్కొనేందుకు నేను సిద్ధమే. - గల్లా అరుణకుమారి



ఈవో, అదనపు ఈవోకు వాహనాల తాళాలను అందిస్తున్న వేణుసుదర్శన్

శ్రీవారికి 16 ద్విచక్ర వాహనాల విరాళం

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం 16 ద్విచక్ర వాహనాలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన టీవీఎస్ మోటార్స్ ఎండీ వేణుసుదర్శన్ ఈ వాహనాలను అందజేశారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనాలకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం దాత వారికి వాహనాల తాళాలను అందజేశారు. 16 ద్విచక్ర వాహనాల్లో 15 ఎలక్ట్రికల్ వాహనాలు ఉన్నాయి. వీటి ధర దాదాపు రూ.22 లక్షలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

డీఎల్ఎస్ఎకు ముగ్గురు సభ్యుల నియామకం

పూతలపట్టు, ఆగస్టు 30: చిత్తూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఎ)కు ముగ్గురు సభ్యులను నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక కార్యకర్తగా పేరుపొందిన చిత్తూరు నగరం ఓబనపల్లికాలనీకి చెందిన ధనంజయనాయుడు, విజయనగర్‌కాలనీకి చెందిన డాక్టర్ జనార్ధన రెడ్డి, యాదమరి మండలం కీనాటంపల్లెకు చెందిన హరినాయుడులను నియమించారు. వీరు రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

పార్టీలు మారడం మామూలే : మేరుగ

తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): 'రాజకీయ పార్టీల్లో నాయకులు ఉండటం, వెళ్లిపోవడం మామూలే. అన్ని పార్టీల్లో జరిగాయి, మా పార్టీలోనూ జరుగుతోంది' అని వైసీపీ నేత, మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని, తప్పకుండా జగన్ మళ్లీ సీఎం అవుతారని జోస్యం చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రగతి కోసం జగనే పనిచేస్తారన్నారు. ఇక, ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎలాంటి హామీలు ఇచ్చారు, ఇప్పుడు ఏం చేస్తున్నారో ప్రజలు చూస్తున్నారన్నారు. అసలు బాధ్యత లేకుండా చంద్రబాబు పరిపాలన చేస్తున్నారని, ఇలా అయితే ప్రజల ఇబ్బందులు, బాధలు, ఇక్కట్లు ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు.

సమాచారలోపంతో అంత్యక్రియలకు ఏర్పాట్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 30: సమాచారలోపంతో అంత్యక్రియలను ఏర్పాటు చేసిన సంఘటన పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు పట్టణంలో నివాసం ఉంటున్న ఓ యువకుడు లివర్ దెబ్బతిని నెల్లూరులోని ఓ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్నాడు. ఈ క్రమంలో వైద్యశాలలో ఆ యువకుడితో ఉన్న వ్యక్తి నాయుడుపేటకు ఫోన్‌చేసి ఆ యువకుడు మృతి చెందినట్లు తప్పుడు సమాచారం అందించాడు. అదే సమయంలో ఆ యువకుడు కుటుంబసభ్యులు నాయుడు పేట పట్టణంలో దహనసంస్కారాలకు ఏర్పాటు చేసేశారు. కొంత సమయం తరువాత ఆ యువకుడు బతికే ఉన్నట్లు సమాచారం రావడంతో ఏర్పాట్లను ఆపేశారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి : డీఆర్ఎం



తిరుపతిలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విజయ్ కుమార్

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 30: తిరుపతి, తిరుచానూరు రైల్వేస్టేషన్లలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచి, నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను గుంతకల్లు డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) విజయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ నిర్వాహణ, స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లాట్ ఫారాల పరిశుభ్రతను మెరుగు పరచాలన్నారు. కోచ్ మరమ్మతుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలన్నారు. అంతకుముందు తిరుచానూరు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సీనియర్‌స్కేల్ అధికారులు శ్రావణ్ కుమార్, చంద్రశేఖర్, మణికంఠ, ఉపేంద్ర కుమార్, ప్రభాకర్, సురేష్ బాబు, మాధవరావు,ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాలక్ష్మి హోమం

సూళ్లూరుపేట, ఆగస్టు 30: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శుక్ర వారం మహాలక్ష్మి హోమం ఘనంగా జరి గింది. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో హోమగుండం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ మహాలక్ష్మి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ముందుగా మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రాకారోత్సవం నిర్వహిం చి హోమగుండం ఎదుగా కొలువుదీర్చి హోమం నిర్వహించారు. గాదిరెడ్డి సుధాకర్ రెడ్డి, కవిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తడ, ఆగస్టు 30: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని సుజాత నగర్‌కు చెందిన బి.రాజా తమిళనాడు గుమ్మడిపూండిలోని ఓ పరిశ్రమలో, భార్య మీనా శ్రీసిటీ సెజ్‌లో ఓ పరిశ్రమలో పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో భార్య, భర్తలిద్దరూ రోజు మాదిరిగానే శుక్రవారం కూడా ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న 7 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండండి

పెళ్లకూరు, ఆగస్టు 30: గ్రామీణ ప్రాంతాల్లో హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో అక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

స్మార్ట్‌సిటీ నిధుల వృథాపై కలెక్టర్ ఆగ్రహం

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 30: నగరాభివృద్ధి కోసం కేంద్ర నుంచి విడుదలవుతున్న స్మార్ట్‌సిటీ నిధులను వృథా చేయడమేంటని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా గురువారం శ్రీనివాస క్రీడా సముదాయంలో నిర్వహించిన ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సముదాయంలో నాలుగేళ్లక్రితం స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మాణం చేపట్టి అర్థంతరంగా ఆపేసిన 'మల్టీపర్పస్ అరేనా' (వివిధ రకాల క్రీడలకు ఉపయోగపడేలా నిర్మాణం)ను గమనించి ఇదేంటి పొదలు, తీగలు అల్లుకుని అపరిశుభ్రంగా ఉందని ప్రశ్నించారు. అధికారులు కల్పించుకుని స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మాణం చేపట్టారని, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం తుది దశ పనులు వాయిదా వేస్తున్నారని వివరించారు. దాంతో ఈ నిర్మాణం వివరాలు నివేదిక రూపంలో ఇవ్వాలన్నారు. అలాగే స్విమ్మింగ్‌పూల్ లీకేజీ సమస్యను కూడా అధికారులు ప్రస్తావించారు. ఈ క్రమంలో ఇక్కడి అసంపూర్తి పనులు, మరమ్మతులు తదితరాలపై సమగ్ర నివేదిక తయారుచేసి రెండ్రోజుల్లోపు అందజేయాలని డీఎస్‌డీవో సయ్యద్ సాహెబ్‌ను కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది.

నాలుగు నెలల్లో బాక్స్ టైపు అండర్ బ్రిడ్జి నిర్మాణం

కాంట్రాక్టర్, అధికారుల హామీ ● శాంతించిన పెరియవట్టువాసులు





పెరియవట్టువాసులతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు - పట్టాలపైకి గ్రామస్తులు రాకుండా మోహరించిన పోలీసులు

తడ, ఆగస్టు 30: బాక్స్ టైపు అండర్ బ్రిడ్జిని నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. మండలంలోని పెరియవట్టు వద్ద అర్థంతరంగా ఆగిపోయిన బాక్స్ టైపు బ్రిడ్జిని పూర్తి చేసి రాకపోకలకు అనుమతించాలంటూ కొద్దిరోజులుగా గ్రామస్తులు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు. వారు పట్టించుకోకపోవడంతో శుక్రవారం బ్రిడ్జి నిర్మాణ స్థలం వద్ద ధర్నాకు దిగారు. ధర్నా విషయం ముందుగా అధికారులకు తెలియడంతో శుక్రవారం ఉదయం 6 గంటలకే స్థానిక పోలీసులు రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్ రైల్వేగేట్ వద్దకు చేరుకున్నారు. గ్రామానికి వెళ్లి ధర్నా విరమించుకోవాలని గ్రామస్తులతో చర్చించారు. గ్రామస్తులు ససేమిరా అంటూ బ్రిడ్జి నిర్మాణ స్థలం రైల్వే ట్రాక్ పక్కనే టెంట్లు వేసి ధర్నాకు దిగారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు రైల్వే పట్టాలపైకి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో సీఐ మురళీకృష్ణ, తహసీల్దారు శరత్ బాబు, ఎంపీడీవో విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఈ లోపు రైల్వే కాంట్రాక్టర్ అక్కడికి చేరుకుని వెంటనే పనులు మొదలుపెట్టి 6 నెలల్లో పూర్తిచేస్తామని తెలిపినా గ్రామస్తులు భీష్మించుకు కూర్చున్నారు. అధికారులు కల్పించుకుని నాలుగు నెలల్లోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేలా కాంట్రాక్టర్, రైల్వే అధికారులను ఒప్పించారు. దీంతో గ్రామస్తులు శాంతించారు. చెన్నై ఆర్పీ ఎఫ్ ఏఎస్ఐ రాజయ్య, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్లు భూమి నాథన్, గోపీరాజు, సదరన్ రైల్వే డిప్యూటీ ఇంజనీర్ వికాష్‌జయదేవ్, ఏడీఈ మురారికుమార్, ఎస్ఐ కొండపనాయుడు తదితరులు ఉన్నారు.

పొట్టకూటి కోసం వెళ్లి మంగళూరులో మృత్యువాత

గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో విషాదఛాయలు





మహేంద్ర (ఫైల్‌ఫొటో)- మహేంద్ర మృతదేహం

కోట, ఆగస్టు 30: తరతరాలుగా కడలి తల్లిని నమ్ముకుని అందులోని చేపలను పట్టుకుని కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్న మత్స్యకారులకు రెండేళ్లుగా కడలి కన్నెర్ర చేసింది. ఆంధ్రా సముద్ర భూభాగంలోకి తమిళ జాలర్లు అక్రమంగా చొచ్చుకొని వచ్చి ఖరీదైన బోట్లతో సముద్రంలో పెద్ద చేపలను మొదలుకొని జల్ల వరకు గద్ద తన్నుకుని వెళ్లినట్లు వెళ్తున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కోట, వాకాడు మండలాల మత్స్యకారులు పిడికెడు మెతుకుల కొరకు పొట్ట చేత పట్టుకొని కర్ణాటకలోని మంగళూరులో కూలి ప్రాతిపదికన సముద్రంలోకి చేపలు పట్టేందుకు వెళ్లారు. అక్కడ సముద్రం కన్నెర్ర చేసింది. గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామానికి చెందిన వావిళ్ల మహేంద్ర(25) మంగళూరు సముద్రంలో గల్లంతై విగత జీవియై ఒడ్డుకు చేరడంతో ఒక్కసారిగా ఇక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రిని కోల్పోయిన ఆ కుటుంబ బాధ్యతలు మోస్తున్న కుమారుడి మృతితో ఆ తల్లి గుండెలవిసేలా రోదిస్తుండగా ఇద్దరు చెల్లెళ్లు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు.

కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామానికి చెందిన 30 మంది మత్స్యకారులు 20 రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు సముద్రంలో కూలి ప్రాతిపదికన చేపల వేటకు వెళ్లారు. ఆయా మత్స్యకారులంతా నిరుపేదలు కావడంతో అక్కడే చేపలుపట్టి అక్కడి యజమానులు కూలీగా ఇచ్చిన నగదును వారివారి ఇళ్లకు పంపి కుటుంబా లను పోషిం చు కుంటూ వస్తున్నారు. ఈ నేప థ్యంలో తమ ప నుల్లో భా గంగా గోవింద పల్లి పాళెంకు చెందిన వావిళ్ల మహేంద్ర సముద్రంలో బోట్‌లో చేపల వేటాడుతూ ప్రమా దవశాత్తు గురువారం తెల్లవారు జామున సముద్రంలో పడిపోయాడు. సహచర మత్స్యకారులంతా గల్లంతైన మహేంద్ర కోసం గాలింపు చర్యలు చేపట్టినప్పటికి ఆచూకి లభ్యం కాలేదు. శుక్రవారం తెల్లవారుజామున మహేంద్ర మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. దీంతో సహచర మత్స్యకారులు స్వగ్రామమైన గోవిందపల్లిపాళెంకు సమాచారం ఇవ్వడంతో మత్స్యకారులంతా శోక సముద్రంలో మునిగి పోయారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు మహేంద్ర తల్లీచెల్లెళ్లు భోరున విలపిస్తూ మంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

కేసుల దర్యాప్తులో వేగం పెరగాలి: ఎస్పీ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30: 'కేసులను త్వరగా దర్యాప్తు చేసి, బాధితులకు న్యాయం చేయాలి. అప్పుడే పోలీసు శాఖపై ప్రజలకు మంచి అభిప్రాయం ఉంటుంది' అని ఎస్పీ సుబ్బారాయుడు అన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ సావేరి సెమినార్ హాలులో శుక్రవారం జిల్లాలోని పోలీసు అధికారులకు నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది. సబ్ డివిజన్లవారీగా నేరాలు, ఇతర కేసులపై సుదీర్ఘంగా ఎస్పీ సమీక్షించారు. కొంత మంది అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. అలసత్వం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. డయల్ 100, 112 కాల్స్‌పై తక్షణం స్పందించాలని కోరారు. బేసిక్, విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గంజాయి హాట్ స్పాట్లలో తగిన బీట్లు, పికెట్లు ఏర్పాటు చేసి తరచూ తనిఖీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతి పోలీసుస్టేషన్‌లో పబ్లిక్ సేఫ్టీ టీమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అపరిచిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

'సైబర్ నేరగాళ్లు రూటు మార్చి.. పోలీసు అధికారుల ఫొటోలను వాట్సాప్ పిక్‌లో పెట్టి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందువల్ల అపరిచితకాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి' అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. మీ పేరు లేదా మీ కుమారుడి పేరుపై పార్శిల్ వచ్చిందని.. అందులో మాదకద్రవ్యాలు ఉన్నట్లు గుర్తించామని బెదిరిస్తూ- తాము ముంబై కస్టమ్స్ డిపార్టుమెంటునుంచి మాట్లాడుతున్నామని పోలీసు యూనిఫాం ఫొటో ఉన్న వ్యక్తి నుంచి మీకు వాట్సాప్ వీడియో లేదా వాయిస్ కాల్ చేసి భయపెడుతున్నారన్నారు. ఇలాంటి అపరిచిత కాల్స్ వచ్చినప్పుడు వెంటనే తాము ఎటువంటి ఆర్డర్ పెట్టలేదని చెప్పి.. సమీప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

ఐదుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

28 దుంగలు, మూడు వాహనాల స్వాధీనం



స్మగ్లర్ల వివరాలు తెలియజేస్తున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 30: వడమాలపేట, పూతలపట్టు పరిసరాల్లో శుక్రవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి.. ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. 28 ఎర్రచందనం దుంగలు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన బృందం, ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం పుత్తూరు సెక్షన్‌లోని వడమాలపేట అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున ఎర్రచందనం దుంగలు మోసుకొస్తూ కొందరు తారసపడ్డారు. వారిని చుట్టుముట్టగా దుంగలను వదలి పారిపోయారు. వారిలో నలుగురిని పట్టుకుని, 26ఎర్రచందనం దుంగలు, ఒక ట్రక్, మరో కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో.. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ముగ్గురు, తిరవళ్లూరు జిల్లాకు చెందిన ఒకరు ఉన్నారు. మరో ఘటనలో ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ చిత్తూరు-కడప హైవేలో పూతలపట్టు సమీపంలోని రంగంపేట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అటువైపు వచ్చిన కారును ఆపే ప్రయత్నం చేశారు. స్మగ్లర్లు కారును పక్కన ఆపి, పారిపోయే ప్రయత్నం చేశారు. ఒకరిని పట్టుకోగా, మిగిలినవారు పారిపోయారు. కారును తనిఖీ చేయగా రెండు ఎర్రచందనం దుంగలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి అన్నమయ్య జిల్లావాసిగా గుర్తించారు. రెండు కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్ తరలించగా, ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు.

చెంగాళమ్మ ఆలయంలో వైభవంగా పుష్పయాగం



సూళ్లూరుపేట, ఆగస్టు 30: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శ్రావణమాస చివరి శుక్రవాకారింర పురస్కరించుకుని పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ చెన్నై నుంచి తెప్పించిన రకరకాల పుష్పాలతో అమ్మవారికి పుష్పార్చన చేశారు. భక్తులు పుష్పాలను అమ్మవారిని పాదాల చెంతకు చేర్చి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా పుష్పయాగానికి తెచ్చిన పుష్పాలను ఆలయ చుట్టూ ప్రదర్శనగా తీసుకెళ్లి అమ్మవారి పాదాల చెంతపెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆస్థాన మండపం వద్దకు తీసుకొచ్చి పుష్పయాగం నిర్వహించారు. ఉభయ కర్తలుగా చెన్నైకి చెందిన ఏ.మోహన్‌రావు, సులోచన, మనోజ్‌సాయి, లత దంపతలు వ్యవహరించారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసబాబు ఉభయకర్తలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పుష్పయాగం అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. పుష్పయాగంలో ఎమ్మెల్యే విజయశ్రీ, చెంగాళమ్మ ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ డి.బాలచంద్రా రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏ.జి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

సూళ్లూరుపేట, ఆగస్టు 30: కాళంగి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రా క్టర్లను శుక్రవారం తెల్లవారు జా మున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక విధానం అమల్లోకి రాడంతో కాళంగి నదిలో ఇసుక తవ్వకాలు నిషేధించారు. అయినా అక్ర మార్కులు కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతో రాత్రివేళల్లో అక్రమంగా రియల్ ఎస్టేట్ భూములకు తరలిస్తున్నారు. గురువారం రాత్రి పోలీసులకు కాళంగి నదిలో ఇసుకను తవ్వుతున్నట్లు సమాచారం రావడంతో ఇలుపూరు సమీపంలో ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు మా ట్లాడుతూ.. కాళంగిలో ఇసుకను ఎవరు తరలించినా చర్యలు తప్పవన్నారు.

గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీలు

ఓజిలి, ఆగస్టు 30: విద్యార్థులకు మంచి వాతా వరణం కల్పించడంతో పాటు భోజన పదార్థాలు రుచిగా, వంట వండే ప్రాం తం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ సూచించారు. మండలం లోని చిల్లమానుచేను గురుకుల పాఠశాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులు, డార్మెటరీలను పరిశీలించారు. అనంతరం వంటశాల, డైనింగ్ రూంను తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిప్రకాశ్‌తోపాటు వంట నిర్వాహకురాలితో మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే తొలుత మంచి వాతావరణం ఉండాలని అదే సమయంలో వారికి అందించే భోజనం రుచిగా ఉండాలన్నారు. ముఖ్యంగా చికెన్ ఇతర మాంసాహారం వండేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. అనంతరం ఆమె చిల్లమానుచేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లను తనిఖీ చేశారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకట సుబ్బయ్య, పార్టీ మండల కన్వీనరు విజయకుమార్‌నాయుడు, కార్యదర్శి నిరంజన్, నాయకులు బి.రవీంద్రాడ్డి, యూనిట్ ఇన్‌చార్జిలు పి.ప్రకాశ్ నాయుడు, కె.సత్యవరప్రసాద్‌రావు, తెలుగుమహిళ నేత పవిత్రారెడ్డి తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

నేడు డ్రగ్స్ ఫ్రీ ఇండియా ర్యాలీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 30: ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ - పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్ ఫ్రీ ఇండియా పేరుతో శనివారం భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. వర్సిటీలో ఉదయం 10 గంటలకు ఈ ర్యాలీని ఎస్పీ సుబ్బరాయుడు, ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ చంద్రాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దామోదరం ప్రారంభిస్తారు. యూనివర్సిటీ నుంచి మహతి దాకా ర్యాలీ సాగుతుంది. ఇందులో యూనివర్సిటీ పరిధిలోని అన్ని కాలేజీల విద్యార్థులు పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినదించాలని ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్ కోరారు.

నేడు 'డిఫెన్స్' పరీక్షలు

తిరుపతి(విద్య), ఆగస్టు 30: నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్-2024 పరీక్షలు శనివారం నగరంలో జరగనున్నాయి. అబ్జర్వర్ బ్రజిలాల్ మీనా, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం పరీక్ష కేంద్రాలను, ఏర్పాట్లను పరిశీలించారు. యూపీఎస్సీ నిర్వహించే ఈ పరీక్షలకు మొత్తం 821 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇందుకుగాను నగరంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ● పరీక్ష కేంద్రం నెంబరు 50005: బాలాజీ కాలనీ వెస్ట్‌చర్చ్ రోడ్డులోని శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు జరగనున్నాయి. ఇంగ్లీష్ పేపర్ ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు, జనరల్ నాలెడ్జ్ పేపర్ మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు జరగనుంది. ఎలిమెంటరీ గణితం పరీక్ష మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వకు జరుగుతుంది. ● పరీక్ష కేంద్రం నెంబరు 50001: శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల వింగ్-ఏ, పరీక్ష కేంద్రం నెంబరు 50002: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల వింగ్-బిలలో నేషనల్ డిఫెన్స్ అండ్ నావెల్ అకాడమీ పరీక్షలు జరగనున్నాయి. గణితం పేపర్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, జనరల్ ఎబిలిటీ పేపర్ మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, ఆగస్టు 30 : మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం గ్రీన్‌ల్యాంబ్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ ప్రాంగణ ఎంపికలకు ఇక్కడ డిగ్రీ కళాశాలలో విద్య అభ్యసించిన 47 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 19 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, ప్రాంగణ ఎంపికల అధికారి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించండి

గూడూరు, ఆగస్టు 30: స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేసే పారి శుధ్య కార్మికులకు జీతాలను చె ల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ షరీనాకు వినతి పత్రం అందజేశారు. నాలుగు నెల లుగా జీతాలు సక్రమంగా ఇవ్వక పోవడంతో వారు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతినెల జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కేవీకే సేవలు అభినందనీయం



కేవీకేలో పంటలను పరిశీలిస్తున్న సూర్యప్రతాప్ సాహి

రేణిగుంట, ఆగస్టు 30: రాస్ కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను ఉత్తరప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి సూర్యప్రతాప్ సాహి అభినందించారు. శుక్రవారం ఉదయం రేణిగుంట మండల పరిధిలోని చైతన్యపురంలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గడచిన 30 సంవత్సరాలుగా కేవీకే రైతులు, మహిళలు, గ్రామీణ యువత కోసం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, వాటి ప్రభావం గురించి కేవీకే అధినేత డాక్టర్ శ్రీనివాసులు వివరించారు. అనంతరం కేవీకే దత్తత గ్రామాల్లో విభాగాల వారీగా చేపడుతున్న కార్యక్రమాల ప్రగతిని అక్కడ ఉన్న శాస్త్రవేత్తలను అడిగి సూర్యప్రతాప్ సాహి తెలుసుకున్నారు. కేవీకేలో పండిస్తున్న పంటలు, నర్సరీ, భూసార పరీక్షల ప్రదర్శన క్షేత్రాలను సందర్శించి శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీలత, సుధాకర్, దివ్య, రాముకుమార్, సామాజిక ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా పథక సంచాలయకులు షణ్ముగం, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

సత్యవేడు, ఆగస్టు 30: మానవ జాతి మనుగడకు పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని సత్యవేడు ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మదనంబేడు జడ్పీహైస్కూల్‌లో అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ చెట్లను కొట్టేయడం వల్ల వాతావరణంలో అసమతుల్యత ఏర్పడి ప్రకృతి విపత్తులకు దారితీస్తాయని వివరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, ఉపాధి ఏపీవో కృష్ణయ్య, సర్పంచు శివరంజని, ఎంపీటీసీ సరోజిని, సెక్రటరీ మాధవి, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు పరమశివం, ఆనంద్, రవి, ప్రభాకర్‌రెడ్డి, శశి, షణ్ముగం, సురేష్, సంపత్ హెచ్ఎం చినబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూపీఎస్‌ను రద్దు చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 30: యూపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ నాయకులు శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సూర్యప్రకాష్ మాట్లాడుతూ యూపీఎస్ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒరిగేది ఏమీ లేదన్నారు. ఓపీఎస్ అమలు అయ్యే వరకు యూటీఎఫ్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. యూపీఎస్ బాగుందని ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తూ ప్రచారం చేస్తున్నారే తప్పా పాత పెన్షన్ విధానంలో ఉన్న సౌలభ్యాలు ఇందులో లేవన్నారు. వెంటనే యూపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు రూప్‌చంద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మోహన్‌బాబు, విజయకుమార్, విజయ, శ్రీనివాసులు, దీపిక, శివకుమార్, మునయ్య, హేమాంబరదరావు, భక్తవత్సలం, ఈశ్వరయ్య, అబ్దుల్ సమద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పసుపుకొమ్ముల అలంకారంలో ముత్యాలమ్మ



శ్రీకాళహస్తి, ఆగస్టు 30: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యా లమ్మగుడివీధిలో వెలసిన ముత్యాలమ్మ శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పసుపుకొమ్ముల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అమ్మవారికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం పసుపు కొమ్మలతో అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా, బజారువీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరికి లక్ష్మీకుబేర పూజ నిర్వహించారు. మహిళా అమ్మదారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం

శ్రీకాళహస్తి, ఆగస్టు 30: నాయీబ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని తిరుపతి పార్లమెంటు నాయీబ్రాహ్మణ సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, దేవరాజులు, కృష్ణమూర్తి అన్నారు. నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25వేలు పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, ఆగస్టు 30: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షణ చేసి తిరిగి కొలువుతీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 30: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రావణమాసం కావడంతో మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 30: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మొక్కల పెంపకంతో జీవవైవిధ్య రక్షణ



విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న ఎంఈవో

పిచ్చాటూరు, ఆగస్టు 30: మొక్కల పెంపకంతో జీవ వైవిధ్య సంరక్షణ సాధ్యమని ఎంఈవో హేమమాలిని అన్నారు. శుక్రవారం మండలంలోని కీళపూడి ప్రాథమిక పాఠశాలలో వనమహోత్సవం నిర్వహించారు. ఎంఈవో హేమమాలిని విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించండి

కేవీబీపురం, ఆగస్టు 30: మండలంలోని దిగువపుత్తూరు గ్రామం వద్ద పుత్తూరు నుంచి పాలమంగళం, దిగువ పుత్తూరు, కోటమంగాపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై వంతెన గత ఏడాది మిచౌంగ్ తుఫాన్ సమయంలో తెగిపోయింది. అప్పటి నుంచి వాహనాల రాకపోకలను వంతెన పక్క పొలంలో నుంచి దారి మళ్లించారు. ప్రస్తుతం వర్షాలతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి వంతెన నిర్మించి రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

మోపురుపల్లె చెరువుకు వేలంపాట

వరదయ్యపాళెం, ఆగస్టు 30: మండలంలోని రాచర్ల పంచాయతీ మోపురుపల్లె చెరువుకు ఎంపీడీవో ప్రసాద్, ఇన్‌ఛార్జి పంచాయతీ విస్తరణ అధికారి చిరంజీవి ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు. మహేష్ రూ.1.50లక్షలకు హక్కులు పొందారు.

విద్యార్థులకు సన్మానం

వరదయ్యపాళెం, ఆగస్టు 30: న్యూఢిల్లీలోని ఎర్రకోటలో గత నెలలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొన్న వరదయ్యపాళెం మండలం సంతవేలూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఝాన్సీ, బుచ్చినాయుడుకండ్రిగ ఏకలవ్య పాఠశాలకు చెందిన యువకిరణ్‌తో పాటు సంత వేలూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు లతను డీఈవో శేఖర్ శుక్రవారం తన కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివ పాల్గొన్నారు.

వైసీపీ నేత కనుసన్నల్లోనే నా భూమి పేరు మార్పు

లబోదిబోమన్న సదాశివపురం రైతు



కుటుంబ సభ్యులతో కలసి తన పేరుతో ఉన్న పత్రాలను చూపుతున్న సురేంద్రరాజు

ఏర్పేడు, ఆగస్టు 30: అధికారాన్ని అడ్డంపెట్టుకుని కబ్జాలే కాదు ఏకంగా ఆన్‌లైన్‌లో ఒకరి భూములు మరొకరి పేరున మార్చేశారు వైసీపీ నేతలు. భూ ఆక్రమణలకు కేంద్రంగా మారిన ఏర్పేడు మండలంలో గత ఐదేళ్లుగా వైసీపీ నేతలు చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇలాంటిదే మరో ఉదంతం కందాడు పంచాయతీ సదాశివపురంలో వెలుగు చూసింది. బాధిత రైతు సురేంద్రరాజు తన భార్య, ముగ్గురు ఆడపిల్లలతో కలిసి ఏర్పేడులో శుక్ర వారం సాయంత్రం విలేకరులకు తన ఆవేదనను వెల్లడించాడు. ఆయన తెలిపిన వివరాలు..... ఏర్పేడు మండలం కందాడు పంచాయతీ సదాశివపురం గ్రామానికి చెందిన సుబ్బరాజుకు ఇద్దరు భార్యలు. సుబ్బరాజు పేరు మీద 17 ఎకరాల పొలం ఉంది. సుబ్బరాజు తన మొదటి భార్య నరసమ్మ కుమారుడు సురేందర్ రాజు పేరు మీద ఆరు ఎకరాలు, రెండో భార్య అమ్ములు పేరున ఆరు ఎకరాలు రిజిస్టర్ చేశాడు. మిగిలిన భూమిని తన పేరుతో ఉంచుకున్నాడు. సుబ్బరాజు చనిపోవడంతో అతని పేరున ఉన్న ఐదెకరాల భూమిని రెండో భార్య అమ్ములు కుమారుడు చంద్రశేఖర్‌రాజు తన పేరిట మార్పించుకున్నాడు. అంతే కాకుండా సుబ్బరాజు మొదటి భార్య కుమారుడు సురేంద్రరాజు పేరిట ఉన్న భూములను చంద్రశేఖర్‌రాజు, ఆయన భార్య ధనమ్మ(ఎండీ పుత్తూరులో సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్), సోదరుడు విజయ్‌కుమార్‌రాజు పేరిట ఆన్‌లైన్ మార్చేసు కున్నాడు. ఇందుకోసం సుబ్బరాజుకు చంద్రశేఖర్‌రాజు, విజయ్‌కుమార్ రాజు అనే ఇద్దరు పిల్లల మాత్రమే ఉన్నారని ఫ్యామిలీ సర్టిఫికెట్ కూడా పొందారు. ఈ విషయం తెలిసి 2022 నుంచి ఏర్పేడు తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగు తున్నా ఎవరూ పట్టించుకోలేదని, చివరకు అప్పటి ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి సోదరుడు కిషోర్‌రెడ్డి చెబితేనే చేస్తామని అధికారులు స్పష్టం చేశారని సురేంద్ర రాజు వాపోయారు. కిషోర్‌రెడ్డి దగ్గరకి వెళితే తాను చెప్పిన దగ్గర సంతకాలు పెట్టి వెళ్లిపో... లేదంటే భూమి మొత్తం మార్చేస్తాను అని బెదిరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్‌రాజు వైసీపీ నేత కిషోర్‌రెడ్డికి అత్యంత సన్నిహితు డని, ఆయన అండదండలతోనే ఆన్‌లైన్‌లో తారుమారు చేశారని సురేంద్రరాజు ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశానని, అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న విజయకుమార్ తదితరులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 30: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో హరితాంధ్ర వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు, శుభకార్యాల సందర్భంగా మొక్కలు నాటాలన్నారు. చెట్లు తగ్గిపోవడం వల్ల పర్యావరణంలో మార్పులు వచ్చి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అటవీశాఖ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్పేడు: బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్, ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, గుణశేఖర్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, కుమార్‌రాజా, ఉమామహేశ్వర్, సురేష్‌బాబు, రాధాకుమారి, రామచంద్రయ్య, వెంకటేశులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఓటీ, ఎన్‌వోటీ ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 30: ఆర్టీసీ ఉద్యోగులకు ఓటీ, నైట్ అవుట్ అలవెన్సు ఇవ్వాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కొత్త ట్రెజరీ పాలసీ ప్రకారం ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్సులు ఎత్తివేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం గ్యారేజీ వద్ద ఎన్ఎంయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆసంస్థ జిల్లా అధ్యక్షుడు గుణశేఖర్ మాట్లాడుతూ గతంలో నైట్‌హాల్ట్‌లో అదనపు పనిగంటలు పనిచేసే ఆర్టీసీ ఉద్యోగులకు అలెవెన్సులు ఇచ్చేవారన్నారు. అయితే ట్రెజరీ అధికారుల ఉదాసీనత కారణంగా రెండింటిని కలిపి ఉద్యోగుల కడుపు కొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. అదే విధంగా లీవ్ ఎన్ క్యాష్మెంట్, ఏఏఎస్ ఇంక్రిమెంట్లు వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు వైడీ కుమార్, శివకుమార్, సీకే రెడ్డి, పీఎస్ ఖాన్, పీసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నైట్‌హాల్ట్ అలవెన్సులు ఇవ్వాల్సిందే: ఎన్ఎంయూ

సత్యవేడు, ఆగస్టు 30: ఆర్టీసీలో రాత్రివేళ డ్యూటీలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు నైట్‌హాల్ట్ అలవెన్సులు చెల్లించాలని ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సత్యవేడు డిపో ఆవరణలో ఎన్ఎంయూ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు చేత పట్టుకుని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్యారేజ్ అధ్యక్షుడు నరేష్, కార్య నిర్వాహక అధ్యక్షుడు సుధాకర్, నాయకులు మణ్యం, కుప్పయ్య, నాగరత్నం, కరీముల్లా, విజయన్, ఏకాంబరం, మహేష్, బాలాజీ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి సహకరించండి

మంత్రి జనార్దనరెడ్డికి ఎమ్మెల్యే ఆదిమూలం వినతి



మంత్రి జనార్దనరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఆగస్టు 30: సత్యవేడు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన రెడ్డిని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. శుక్రవారం తిరుపతి పర్యటనకు విచ్చేసిన మంత్రిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిని వివరించి వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా గత ప్రభుత్వంలో మంజూరైన నాగలాపురం - చిన్నపాండూరు రోడ్డు విసతరణ పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా వదిలేశారని, ప్రస్తుతం రోడ్డు అధ్వాన స్థితికి చేరుకుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు సత్యవేడు మండలంలోని దాసుకుప్పం బైపాస్ రోడ్డు, కేవీబీపురం మండలం పూడి కాజ్‌వే, పాలమంగళం హైలెవల్ బ్రిడ్జి, ఊత్తు కోట - సత్యవేడు మార్గంలో కల్వర్టు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిం చాలని మంత్రిని కోరారు. అదే విధంగా సత్యవేడు, నాగలాపురం, నారాయణవనం మండలాల్లో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అనంతరం ఆర్అండ్‌బీ జిల్లా కార్యాలయంలో మంత్రితో కలిసి వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు.

రోడ్డు విస్తరణ బాధితులతో తహసీల్దారు చర్చలు

రేణిగుంట, ఆగస్టు 30: రేణిగుంట - కడప రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన బాధితులతో నష్టపరిహారం చెల్లింపు విషయమై తహసీల్దారు సురేష్‌బాబు శుక్రవారం సాయంత్రం చర్చించారు. కార్యక్రమంలో సర్పంచు ఈశ్వరమ్మ, టీడీపీ నాయకులు బుచ్చినాయుడు, పాడి రాజేంద్ర, మోహన్, వీఆర్వోలు కృష్ణపిళ్లై, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేమాలమ్మ కొలుపు

శ్రీకాళహస్తి, ఆగస్టు 30: శ్రీకాళహస్తి మండలం మంగళపురి గ్రామంలో శుక్రవారం వేమాలమ్మ అమ్మవారికి కొలుపు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్య నాయుడు హాజరై ప్రత్యేక పూజలు చేసుకున్నారు. కార్యక్రమంలో కన్నలి ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగమల్లి దుర్గాప్రసాద్, వినయ్, ప్రవీణ్, వెంకట్, ఖాదర్, పవన్ తదితరులు హాజరయ్యారు.

పుత్తూరు వార్తలు

మానవ మనుగడకు మొక్కలే ఆధారం



మొక్కలు నాటుతున్న అటవీ శాఖాధికారులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 30: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని మున్సిపల్ చైర్మన్ హరి, కమీషనర్ కేఎల్ఎన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మాధవి ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖాధికారులు రవిప్రకాష్, లోకేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరాచారి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నైట్‌హాల్ట్ అలవెన్సులు పునరుద్ధరించాలి

పుత్తూరు టౌన్, ఆగస్టు 30: ఆర్టీసీలో రాత్రివేళ డ్యూటీలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు నైట్‌హాల్ట్ అలవెన్సులు పునరుద్ధరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో పుత్తూరు డిపో ఎదుట కార్మికులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం డిపో ఎండీకి వినతి పత్రం అందజేశారు. యూనియన్ కార్యదర్శి ఎం.శివకుమార్, గ్యారేజ్ ప్రెసిడెంట్ రమేష్ కార్యదర్శి దారబాబు, జిల్లా అధ్యక్షుడు ఎస్‌జే.పెరుమాల్, జిల్లా అధ్యక్షుడు ఎస్‌జే పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవం

పుత్తూరు టౌన్, ఆగస్టు 30: ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాన్ని పుత్తూరు డివిజన్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేదవ్యాస డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యారంగం - విద్యార్థులపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి సాయికిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వడమాలపేట ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందజేస్తున్న డీఈవో శేఖర్ తదితరులు

వడమాలపేట, ఆగస్టు 30: వడమాలపేటలోని బాలుర ఉన్నత పాఠశాల స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయింది. విద్యా సంవత్సరంలో క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న విద్యార్థుల ప్రతిభ ఆధారంగా పాయింట్లు కేటాయించి, డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఏటా జిల్లా స్థాయిలో 5 పాఠశాలలకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. 2023-24లో వడమాలపేటలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 178 పాయింట్లు సాధించి మూడవ స్థానంలో నిలిచింది. శుక్రవారం క్రీడా దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో శేఖర్ నుంచి ప్రధానోపాధ్యాయురాలు కరుణా నవనీతం, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రాజు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, డీఎస్‌డీవో సయ్యద్ భాష, స్కూల్ గేమ్స్ సెక్రటరీలు జయరామయ్య, బాబు పాల్గొన్నారు.

మాతమ్మ ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న దాతలు

వడమాలపేట, ఆగస్టు 30: మండలంలోని తిరుమణ్యంలో రేణుకా మాతమ్మ ఆలయ రెండవ వార్షిక ఉత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గౌరమ్మ ముగ్గువేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు తోటలో తపస్మాన్ ఎక్కి ముద్ద పూలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. రాత్రి అమ్మవారికి మంగళ హారుతులిచ్చి ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం తిరుమణ్యం రాజులకండ్రిగకు చెందిన పుత్తూరు ఆర్టీసీ జయచంద్ర భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుప్పయ్య, జయచంద్రయ్య, మునస్వామి, చెంగయ్య వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 30: పాఠశాలల అభివృద్ధిపై ఎస్ఎంసీ చైర్మన్లు దృష్టి పెట్టాలని ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం పుత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో పాఠశాలల అభివృద్ధిపై ఎస్ఎంసీ చైర్మన్లు, గ్రామ, వార్డు సచివాలయ విద్య సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ పాఠశాలలో సచివాలయ సిబ్బంది కర్తవ్యాలను, చైర్మన్లు విధివిధానాల గురించి చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాధాకృష్ణుల కల్యాణోత్సవం



వడమాలపేట, ఆగస్టు 30: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీకృష్ణ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాధాకృష్ణుల కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేసి పట్టుపీతాంబరాలతో నూతన వధూవరులుగా అలంకరించారు. పురోహితుడు రఘునాథ శర్మ ఆధ్వర్యంలో మేళతాలలు, మంగళ వాయిద్యాలు వేదమంత్రాలు నడుమ మాంగల్య ధారణ చేయించారు. షోకూరు మల్లికార్జునశెట్టి ఉభయ దాతగా వ్యవహరించారు.